క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ మూకల దాడి



సత్తెనపల్లి: నియోజకవర్గ పరిధిలోని ముప్పాళ్ళకు చెందిన షేక్ పఠాన్ జాన్‌బాషాపై శనివారం రాత్రి టీడీపీ మూకలు దాడి చేశాయి. గాయాలపాలైన జాన్‌బాషాను బంధువులు పట్టణంలోని ఏరియా వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు జాన్‌బాషాను ఆదివారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. పార్టీ, ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పఠాన్ జాన్‌బాషాపై దాడి చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ముప్పాళ్ళ, సత్తెనపల్లి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



క్రోసూరు: క్రోసూరు మండలం గరికపాడు గ్రామంలోని తొమ్మిది కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. క్రోసూరు వైఎస్సార్‌సీపీలో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వయంగా పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం అందరూ కలసి పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి తాను అండగా ఉంటానని ఎవరికి ఏ అవసరమొచ్చినా తాను ఉన్నాననే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో గరికపాడు గ్రామ టీడీపీ వైస్ ప్రెసిడెంట్ చల్లంచర్ల మహేశ్వరి, ఆనందరావు, సీతారామయ్య, అంజలి కుమారి, తలుపుల గోపి, దండేబోయిన బాజీ, దండేబోయిన ఏసుమరియమ్మ, దండేబోయిన సాంబశివరావు, దండేబోయిన రమణ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల నాయకులున్నారు.

క్రోసూరులో మీ కోసం మీ ఎమ్మెల్యే కార్యక్రమం



క్రోసూరు: పాపకు ఏ పేరు పెట్టారు, పోలియో చుక్కలు వేయించండి, తల్లీబిడ్డల ఆరోగ్యం చూసుకోవాలంటూ ఎమ్మెల్యే పలకరింపులు.. మీ హోటల్ బాగా సాగుతుందా? జాగ్రత్తగా చేసుకోండి అంటూ ధైర్యం చెప్పటం.. ఇలా ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ముందుకు సాగారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు. మీ కోసం మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న ఆయనకు ప్రజల నుంచి సాదర స్వాగతం లభిస్తుంది. ఆదివారం క్రోసూరు కొండ కింద బజారులో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఐదేళ్లలో సంక్షేమ పథకాలు ఆటంకాలు లేకుండా అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మా వీధుల్లో సిమెంటు రోడ్లు వేశారని, సంక్షేమ పథకాలన్నీ సమయానికి వలంటీర్లు ఇంటికొచ్చి అందిస్తున్నారని ఎమ్మెల్యేకు స్థానికులు తెలుపుతూ సంతోషం వ్యక్తపరిచారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల కోసమేనని, వాటిని వినియోగించుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా అనిల్ కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు వెలది అప్పారావు, జెడ్పీటీసీ షేక్ జమీల, అప్పిరెడ్డి, వెంకటేశ్వరరావు, దాసు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

విషజ్వరాల బారిన పడిన గ్రామాలకు వైద్యం అందించండి

క్రోసూరు: మండలంలోని గరికపాడు, గుడిపాడు, గాదెవారిపాలెం, ఆవులవారిపాలెం గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారిన పడి ప్రయివేటు వైద్యం చేయించుకోలేక అవస్థలు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే వైద్యం అందించాలని సీపీఎం ఆదివారం ప్రకటనలో కోరింది. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గరికపాడు గ్రామంలో గత నెల రోజులుగా విష జ్వరాలతో బాధపడుతున్న ప్రజలను కలవడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ గత నెల రోజులుగా గుడిపాడు , గరికపాడు, గాదేవారిపాలెంలో ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వ వైద్య అధికారులు ఇప్పటివరకు ఆ గ్రామాలను పరిశీలించలేదన్నారు. ప్రజలకు సరైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్వర్లు, శేషగిరి, భాస్కరరావు, నాగరాజు, మహమ్మద్ షా పాల్గొన్నారు.

చుక్కల మందుతో చక్కని జీవితం

సత్తెనపల్లి: ఐదేళ్లలోపు చిన్నారులకు రెండు చుక్కల మందు వారి చక్కని జీవితానికి దోహద పడుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్లో గల రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆదివారం ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పోలియోను పారదోలేందుకు పోలియో చుక్కలే ఏకైక మార్గమన్నారు. అనంతరం చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. అలాగే పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ కొత్త రామకృష్ణ పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. సత్తెనపల్లి పీపీ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలో మొత్తం 34 పోలియో కేంద్రాలు, ఒక మొబైల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు 5,721 మందిని గుర్తించారు. వారిలో ఆదివారం 5,523 మందికి అనగా 98 శాతం మందికి చుక్కలు వేసినట్లు పీపీ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ అనూష తెలిపారు. అలాగే సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 35 పోలియో కేంద్రాలు, ఒక మొబైల్ కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 6,874 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు గాను 6,061 మందికి అనగా 96.02 శాతం మందికి చుక్కలు వేసినట్లు వైద్యులు తెలిపారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, ధూళిపాళ్ల ది ఆంధ్ర బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, డాక్టర్ వి.ప్రదీప్, డాక్టర్ కవిత, డాక్టర్ గౌతమి, డాక్టర్ సాయితేజ రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి పి.శ్రీనివాసరావు, హెల్త్ నర్స్ జీవీసీకే మీనాక్షమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు జే సంపూర్ణ, ఏ వరలక్ష్మి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

పెదకూరపాడు: మండలంలోని తాళ్లూరు పీహెచ్‌సీ పరిధిలో 96 శాతం మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ వెలుగొండారెడ్డి తెలిపారు. పల్స్ పోలియో శిబిరాన్ని మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలో 0–5 సంవత్సరాలలోపు పిల్లలు 5,324 మంది ఉండగా 4,324 మందికి పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాలలో సిబ్బంది ఇంటింటికీ తిరిగి వేస్తారని చెప్పారు. మిరపకోతలకు వచ్చిన వలస కూలీల పిల్లలకు కూడా మొబైల్ టీంల ద్వారా పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్స్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అచ్చంపేట మండలంలో..

అచ్చంపేట: మండలంలో 95 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఆదివారం పల్స్ పోలియో కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మండలంలో 5,715 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నారని, వీరిలో 5,200 మందికిపైగా పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. ఇందుకు గాను 36 పల్స్ పోలియో శిబిరాలను ఏర్పాటు చేసి ఒక్కొక్క శిబిరంలో నలుగురు సిబ్బంది చొప్పున 144 మందిని నియమించినట్లు చెప్పారు. వీరు కాక రెండు మొబైల్ టీంల ద్వారా వలస కూలీల పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. మిగిలిన చిన్నారులకు సోమ, మంగళవారాలలో సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. తాడువాయిలో పల్స్ పోలియో శిబిరాన్ని ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ ప్రారంభించారు. చెరుకుంపాలెంలో జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి గ్రామంలో పల్స్ పోలియో విజయమంతమైనట్లు డాక్టర్ ఇన్నారెడ్డి చెప్పారు.



పట్టణంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కమిషనర్ కొలిమి షమ్మి



గణపవరం పంచాయతీ కార్యాలయంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ



తాళ్లూరులో పోలియో చుక్కలు వేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి

నకరికల్లు మండలంలో..

నకరికల్లు: పోలియో చుక్కలతో పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని నకరికల్లు, కుంకలగుంట పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ మణికంఠ, డాక్టర్ పూజ అన్నారు. మండలంలోని నకరికల్లు, కుంకలగుంట పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేశామన్నారు. నకరికల్లు పీహెచ్‌సీ పరిధిలో 3,226 మంది చిన్నారులకు గాను 3,091 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. 96 శాతం పూర్తయిందన్నారు. కుంకలగుంట పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు వయస్సు గల చిన్నారులు 2,753 మందిని గుర్తించగా వారిలో 2,639 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. 96 శాతం కార్యక్రమం పూర్తయిందన్నారు. వైస్ ఎంపీపీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రోటరీ క్లబ్ పిడుగురాళ్ల శాఖ బాధ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండలంలో 94 శాతం పల్స్ పోలియో

రాజుపాలెం: మండలంలో 93.5 శాతం పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటకృష్ణకుమార్ ఆదివారం తెలిపారు. 23 పల్స్ పోలియో కేంద్రాలలో 3,985 మంది పిల్లలకు గాను 3,744 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. గణపవరం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి కొండమోడులోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని పరిశీలించారు. వందశాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మిగిలిన వారికి 4, 5 తేదీలలో ప్రతీ గ్రామంలో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, స్టాఫ్ నర్సు చందన, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చెరుకుంపాలెంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు విజయప్రతాప్‌రెడ్డి

మండలంలో 97 శాతం పల్స్ పోలియో పూర్తి

అమరావతి: బాలబాలికలు భవిష్యత్‌లో వికలాంగులు కాకుండా ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. ఆదివారం స్థానిక జేబీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రంలో చిన్నారులకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, ఎంపీపీ మేకల హనుమంతరావులు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ మాట్లాడుతూ మండలంలో 29 పల్స్ పోలియో కేంద్రాలతో పాటు ఒక సంచార కేంద్రం కూడా ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఐదు సంవత్సరాలలోపు ఉన్న 5,936 పిల్లల్లో 5,758 మందికి పోలియో చుక్కలు వేశామని తెలిపారు. సోమ, మంగళవారాలలో గ్రామాలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసి వందశాతం పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావుతోపాటు ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బెల్లంకొండ మండలంలో 2100 మందికి పోలియో చుక్కలు

బెల్లంకొండ: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ఆదివారం 2,100 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. మండలంలో మొత్తం 25 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాలలో 5 సంవత్సరాలలోపు చిన్నారులు 2,107 మంది లక్ష్యం కాగా మొదటిరోజు 2,100 మందికి పోలియో చుక్కలు అందించామన్నారు. సోమవారం, మంగళవారం కూడా వైద్య సిబ్బంది గ్రామాలలో ప్రతి ఇంటికీ తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. వంద శాతం పోలియో చుక్కలు వేయడమే ధ్యేయమని వైద్యులు తెలిపారు. గ్రామాలలో జరిగిన కార్యక్రమాలలో గ్రామాలకు చెందిన నాయకులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అంసుధార్, సూపర్‌వైజర్ బాషా, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.



స్థానిక జె.బి.స్కూల్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం



నకరికల్లులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ మణికంఠ, రోటరీక్లబ్ సభ్యులు, సిబ్బంది



బెల్లంకొండలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యులు

పోలియో రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలి

క్రోసూరు: పల్స్ పోలియో కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. క్రోసూరులో నాలుగు రోడ్ల సెంటర్, సచివాలయాల్లో పోలియో చుక్కలు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. నియోజకవర్గంలో ప్రతి సచివాలయం, బస్టాండ్లు, మెయిన్ సెంటర్లలో, చెక్ పోస్టుల వద్ద పోలియో చుక్కలు వేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి.. పోలియో రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలన్నారు. సోమ, మంగళవారాల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని పీహెచ్‌సీ వైద్యురాలు డీపీఎస్ రమాదేవి తెలిపారు. తొలిరోజు 97 శాతం చుక్కల మందులు వేసినట్లు ఆమె చెప్పారు.



క్రోసూరులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

మండలంలో 95 శాతం పల్స్ పోలియో నమోదు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పీ రమాదేవి ఆదివారం తెలిపారు. మొత్తం 4,381 మంది చిన్నారులకు గాను 4,161 మందికి పోలియో చుక్కలు అందించామన్నారు. 95% పల్స్ పోలియో నమోదైనట్లు ఆమె తెలిపారు. డీఎంహెచ్‌వో బీ రవి ముప్పాళ్ళ పీహెచ్‌సీని సందర్శించి, పోలియో చుక్కల కార్యక్రమాన్ని పరిశీలించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందించాలన్నారు. మాదల, ఇరుకుపాలెం, తొండపి, రుద్రవరం గ్రామాల్లో జరిగిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని వైద్యాధికారి పీ రమాదేవి పరిశీలించారు. ముప్పాళ్ళ, నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లోని కార్యక్రమాన్ని వైద్యుడు జయకృష్ణ పర్యవేక్షించారు. సీహెచ్‌వో ఆంజనేయులు, సూపర్‌వైజర్లు ఏ పీటర్‌డేమియన్, జోస్ఫిన్‌రాణి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ముప్పాళ్ళ పీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో రవి

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న చేరికలు

- లక్కరాజు గార్లపాడులో టీడీపీని వీడిన 10 కుటుంబాలు
- అన్ని వర్గాలకు అండగా జగనన్న ప్రభుత్వం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారని, ఆయన సుపరిపాలనను ఆదరిస్తూ వైఎస్సార్‌సీపీలో చేరికలు కొనసాగుతున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సత్తెనపల్లి మండల పరిధిలోని లక్కరాజు గార్లపాడు గ్రామం నుంచి 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు వారందరికీ వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు మనమందరం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, లక్కరాజు గార్లపాడు మాజీ సర్పంచ్ గోపిదేశి శివయ్య, పార్టీ నేతలు యర్రసాని లక్ష్మయ్య, జొన్నలగడ్డ సాగర్, జొన్నలగడ్డ వెంకట్రావు, జొన్నలగడ్డ నాగేశ్వరరావు, 16వ వార్డు ఇన్‌చార్జ్ నందిగం ఆదాం, స్థానిక నాయకులు తదితరులున్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన లక్కరాజు గార్లపాడు వాసులతో మంత్రి అంబటి రాంబాబు

ధర్మబద్ధమైన పాలన అందించాం

ప్రముఖులు, వైద్యులతో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సుహృద్భావ రాజకీయ వాతావరణంలో ధర్మబద్ధమైన పరిపాలన అందించామని, అన్ని వర్గాలకు సంతృప్తికర స్థాయిలో పారదర్శకంగా సంక్షేమాన్ని ప్రభుత్వం అందించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ప్రముఖ వైద్యశాలల వైద్యులతో ఆయన వ్యక్తిగతంగా భేటీ అయ్యారు. స్థానిక అంశాలపై చర్చించారు. అయినంపూడి సాంబశివరావు, డాక్టర్ షకీలా శ్రీధర్, డాక్టర్ కనగాల ప్రశాంతి, డాక్టర్ కనగాల రాజేష్, డాక్టర్ రమేష్, డాక్టర్ రాజలక్ష్మి, డాక్టర్ గోపీనాయక్, డాక్టర్ కోటా సైదయ్య, డాక్టర్ ఆళ్ల స్థిమిత, డాక్టర్ గవిని కృష్ణమూర్తి, తదితరులతో చర్చించారు. రానున్న ఎన్నికల్లో సహకరించాలని కోరారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ట్రేడ్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహారావు, నియోజకవర్గ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులున్నారు.



రిటైర్డ్ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ గోపీనాయక్‌తో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

ఘర్షణపై పరస్పర కేసులు

ముప్పాళ్ళ: ముప్పాళ్ళలోని ముస్లిం కాలనీలో టీ దుకాణం వద్ద శుభ్రం చేసే సమయంలో చెలరేగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణపై పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హజరతయ్య ఆదివారం తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముస్లిం కాలనీకి చెందిన సైదాబి తన టీ దుకాణం వద్ద శుభ్రం చేసి నీళ్లు చల్లే సమయంలో పక్కనే ఉన్న ఘన్‌సైదాపై పడటంతో ఇరువురి మధ్య వివాదం చెలరేగింది. వివాదం ముదిరి ఇరు కుటుంబాల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో నాగూర్‌జానీబాషా తలకు గాయమైంది. గాయపడిన జానీబాషా చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. జానీబాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, వివాదాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఘన్‌సైదా కోడలైన పఠాన్ షబానాకు గాయాలవటంతో ఆమె ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

క్రోసూరు: మండలంలోని ఊటుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ బసవరాజు ఆదివారం తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతులు, ఏబీ స్విచ్ ఏర్పాటు కొరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

గోల్డ్ అప్రైజర్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం

సత్తెనపల్లి: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ పెదరావూరు బ్రాంచ్‌లో గోల్డ్ అప్రైజర్‌గా పని చేస్తున్న డోగిపర్తి లలిత్‌బాబు ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. మృతుడి కుటుంబానికి గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ తరుపున రూ.లక్ష ఆర్థిక సహాయం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ వీరారెడ్డి, యూనియన్ ప్రెసిడెంట్ శిరసాల వాసుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ నయిమ్ చేతుల మీదుగా ఆదివారం అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ లీలా చంద్రముడ్, కోశాధికారి కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కామేశ్వరరావు, యూనియన్ మెంబర్స్ పాల్గొన్నారు.

'సిద్ధం' విజయవంతం చేయాలి

మాదల(ముప్పాళ్ళ): ప్రతిపక్షాల గుండెల్లో వణుకు తెప్పించేలా ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త సిద్ధం సభకు తరలిరావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఈ నెల 10వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మేదరమెట్ల సమీపంలో నిర్వహించనున్న నాల్గవ సిద్ధం సభ సన్నద్ధంపై ఆదివారం సమావేశం నిర్వహించారు. సిద్ధం సభలు చరిత్ర సృష్టిస్తున్నాయన్నారు. జన ప్రభంజనం చూసి ప్రతిపక్షాల వెన్నులో వణుకు మొదలైందన్నారు. పారదర్శక పాలన, సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా నిలిచాయన్నారు. రానున్నది మన ప్రభుత్వమేనని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించే వరకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఐక్యంగా, సమష్టి కృషితో సిద్ధం సభను విజయవంతం చేసేందుకు అందరూ తరలిరావాలని కోరారు.

మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు...

రానున్న ఎన్నికల సమయంలో స్థానిక పర్యటన కోసం కొనుగోలు చేసిన బుల్లెట్ వాహనంతో మంత్రి అంబటి రాంబాబు హల్‌చల్ చేశారు. సత్తెనపల్లి నుంచి మాదల వరకు నూతనంగా కొనుగోలు చేసిన బుల్లెట్ వాహనాన్ని నడుపుకుంటూ మధ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గ్రామస్తులతో ముచ్చటిస్తూ ర్యాలీగా వచ్చారు. అనంతరం మహంకాళి అమ్మవారి ఆలయంలో వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాదల గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ గ్రామస్తులతో మమేకమయ్యారు. టీస్టాల్, టిఫిన్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగారెడ్డి, శివప్రసాద్, మండల కన్వీనర్ శ్రీనివాసరావు, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, సైదా, ఎంపీటీసీ అంజిబాబు, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు అయ్యప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి, శ్రీనివాసరావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.



మాదలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు